క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించండి

పెద్దముడియం : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే అధికారులు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కె.కె.సుధ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ అధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో తాగునీటి సమస్య, రహదారులపై చెత్తా చెదారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అరుణ, మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సచివాలయాల పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కుళాయిబాబు

వల్లూరు(చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని కొలుములపల్లి, బుగ్గలపల్లి సచివాలయాలను ఎంపీడీఓ కుళాయిబాబు శనివారం తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఎంపీడీఓ కుళాయిబాబు సచివాలయ రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో సమావేశం నిర్వహించి, సిబ్బందికి విధులపట్ల అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కెరీర్‌పై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న ట్రైనర్ ప్రేమానందరెడ్డి

వేంపల్లె : స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అరవింద్ ఆధ్వర్యంలో కెరీర్ అవేర్‌నెస్ ప్రోగ్రాంను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన యాటిట్యూడ్ ట్రైనర్ ప్రేమానందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువు పూర్తయిన తర్వాత ఉండే ఉద్యోగ అవకాశాలను ఏ విధంగా పొందాలి, క్రమశిక్షణగా మెలగి తమ భవిష్యత్తును బంగారు బాటగా మలుచుకోవాలని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పశుగణన పోస్టర్ల విడుదల


పోస్టర్‌లను విడుదల చేస్తున్న ఆర్డీఓ సాయిశ్రీ

జమ్మలమడుగు : పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశుగణన పోస్టర్లను ఆర్డీఓ సాయిశ్రీ శనివారం విడుదల చేశారు. పశుసంవర్ధకశాఖ ఏడీ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పశుగణన కార్యక్రమాన్ని 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. మొత్తం పశువుల సంఖ్యను లెక్కిస్తారన్నారు. కార్యక్రమంలో పశు వైద్యులు పాల్గొన్నారు.

మెప్మాతో మహిళలకు ఉపాధి


మెప్మా స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ శేషఫణి

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని మెప్మా సంస్థలో ఉన్న మహిళలకు స్వయం ఉపాధి లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలిపారు. శనివారం పట్టణంలోని కడప రోడ్డులో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్ స్టాల్స్‌ను ఆయన ప్రారంభించారు. ఇందులో స్వయం సహాయక సంఘాలలోని సభ్యులు తయారు చేసిన వస్తువులు ఒపెన్ మార్కెట్ స్టాల్స్‌లో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ నాగేంద్ర, సీవోలు, మహిళలు పాల్గొన్నారు.

దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు

పులివెందుల రూరల్ : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న రైతు బజార్‌లో దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకోవచ్చునని రైతు బజార్ ఎస్టేట్ అధికారిణి బి.రుచిత తెలిపారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతుబజారులో ఆమె మాట్లాడుతూ రైతు బజారులో 22 స్టాల్స్, 13 దుకాణ గదులు ఖాళీగా ఉన్నాయని, ఇక్కడ పండ్లు, కూరగాయలు, నిత్యావసర సరుకులు, పూలు, ఇతరత్రా విక్రయించుకోవచ్చునన్నారు. ఇంజినీరింగ్ అధికారులు నిర్దేశించిన మేరకు నెలసరి బాడుగ చెల్లించాల్సి ఉంటుందని, ఆసక్తి గలవారు 15 రోజుల్లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు మార్కెట్ యార్డులోని రైతు బజారులో ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు సంప్రదించాలని ఆమె కోరారు.

పల్లెల్లో విద్యుత్ స్మార్ట్ మీటర్లు



సింహాద్రిపురంలో స్మార్ట్ విద్యుత్ మీటర్లను బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది

- కసరత్తు ప్రారంభించిన విద్యుత్ శాఖ
- తొలి విడతగా ప్రభుత్వ కార్యాలయాల్లో
- త్వరలో అన్ని రకాల విద్యుత్ కనెక్షన్లకు మీటర్ల అమరిక

సాంకేతికత అన్ని రంగాలలో విస్తరిస్తోంది. తాజాగా విద్యుత్ శాఖలో మరో అడుగు ముందుకు పడుతోంది. దీంతో విద్యుత్ బకాయిలకు చెల్లుచీటి పడనుంది. మనం వినియోగించే విద్యుత్ అవసరాలకు ముందుగానే రొక్కం చెల్లించేలా నూతన విధానం అమలుకు అడుగులు పడుతున్నాయి. ప్రస్తుతం విద్యుత్ వాడకం అనంతరం ఎన్ని యూనిట్లు ఖర్చు చేశామో లెక్కకట్టి విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నాం. త్వరలో స్మార్ట్ విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయనుండటంతో ముందస్తుగా రీచార్జ్ చేసుకుని ఆ మేరకు వినియోగించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం మనం సెల్‌ఫోన్‌కు ప్రీపెయిడ్ పద్ధతిలో ఏ విధంగా రీచార్జి చేసుకుని వాడుతున్నామో అదేవిధంగా విద్యుత్ మీటర్లకు మనం రీచార్జి చేయించుకుని విద్యుత్‌ను వినియోగించుకోవాల్సి ఉంటుంది. బ్యాలెన్స్ అయిపోయిన వెంటనే విద్యుత్ సరఫరా ఆటోమేటిక్‌గా నిలిచిపోతుంది. మళ్లీ రీచార్జి చేసుకోవాలి. లేకుంటే చీకట్లో మగ్గాల్సిందే. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటులో సంబంధిత శాఖ యంత్రాంగం నిమగ్నమైంది.

సింహాద్రిపురం : మండలంలో దాదాపు 8800 పైచిలుకు వివిధ రకాల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రభుత్వ కార్యాలయాల్లో, పంచాయతీ మోటార్లకు, వీధిలైట్లకు, ప్రైవేట్ మీటర్లకు దాదాపు 940 వరకు మొదటి దశలో వారం రోజుల నుంచి పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతానికి ఆ మీటర్లలో ఎటువంటి సిమ్ కార్డు అమర్చలేదు. దశల వారీగా వాటిని స్మార్ట్ విద్యుత్ మీటర్లుగా మార్చనున్నారు. ప్రస్తుతం ఈ నెల వినియోగించిన కరెంటు బిల్లు మరుసటి నెల చెల్లిస్తున్నాం. బిల్లు పొందిన 15 రోజుల వరకు అపరాధ రుసుం ఉండదు. అపరాధ రుసుంతో మరో 15 రోజుల్లో బిల్లు చెల్లించడానికి సమయం ఉంటుంది. ఈ లెక్కన వినియోగదారుడికి బిల్లు చెల్లించడానికి దాదాపు నెల వరకు సమయం ఉండే ఈ పద్ధతినే అనుసరిస్తున్నాం. తాజాగా కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు సంబంధించిన చర్యలను రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరం చేసింది. త్వరలోనే అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసేలా నిర్ణయించింది. ముందుగా అన్ని ప్రభుత్వ, కమర్షియల్ కార్యాలయాల్లో స్మార్ట్ విద్యుత్ మీటర్ల అమరిక ప్రారంభమైంది. 2025 జనవరికి అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ విద్యుత్ మీటర్లు అమరిక చేయాలనే నిర్ణయంతో అధికార యంత్రాంగం అడుగులు వేస్తోంది. ఈ నూతన విదానం ద్వారా ప్రీపెయిడ్ మీటర్లకు ముందుగానే రీచార్జ్ చెయాల్సి ఉంటుంది. ఆలా చేయకపోతే సరఫరా ఆటోమేటిక్‌గా కట్ అయిపోతుంది. ఇప్పటి వరకు అమలవుతున్న విధానానికి అలవాటుపడిన వినియోగదారులకు దీనిపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

విద్యుత్ స్మార్ట్ మీటర్లతో అవస్థలు



ప్రస్తుతం విద్యుత్ శాఖ ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ విద్యుత్ మీటర్లతో అవస్థలు పడాల్సి వస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో మాలాంటి వారికి వీటిపై పెద్దగా అవగాహన లేదు. సాంకేతిక పరిజ్ఞానంలేని వారు ఈ విధానంతో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

\- చిన్ని, వినియోగదారుడు, సింహాద్రిపురం

బడుగులపై భారమే



ఈ నూతన విధానం బడుగులకు భారం కానుంది. విద్యుత్ వినియోగదారుల్లో మధ్యతరగతి వారి కంటే బడుగులే అధికంగా ఉంటారు. వీరు వినియోగించే విద్యుత్‌కు సంబంధించి ముందుగా మొత్తం చెల్లించాలంటే మాలాంటి వారికి భారమే. ప్రస్తుత రోజుల్లో క్షణం విద్యుత్ లేకున్నా ఉండటం కష్టం. ఈ తరుణంలో స్మార్ట్ విద్యుత్ మీటర్ల వినియోగంతో ప్రజలకు ఇబ్బందులు తప్పవు.

\- షబ్బీర్, సింహాద్రిపురం

68వ ఎస్‌జీఎఫ్ జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక


అజిత్‌రెడ్డి

కమలాపురం : మండల పరిధిలోని టి.చదిపిరాళ్లకు చెందిన 6వ తరగతి విద్యార్థి చాగారి అజిత్‌రెడ్డి 68వ ఎస్‌జీఎఫ్ జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ చంద్రఓబుల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు నంద్యాలలో జరిగిన స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో పాల్గొన్న అజిత్‌రెడ్డి ఫెన్సింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఫాయిల్ విభాగంలో వ్యక్తిగతంగానూ, టీం ఛాంపియన్ షిప్‌లోనూ స్వర్ణ పతకాలు సాధించాడు. 2024 నవంబర్‌లో జమ్ము-కశ్మీర్‌లో జరిగే జాతీయస్థాయి 68వ ఎస్‌జీఎఫ్ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. అజిత్‌రెడ్డికి ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

కమలాపురం : ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ సీవీ రాజగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు.

శనివారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం లో ఆయన మట్లాడారు. అత్యవసరానికి రక్త నిర్ధారణ ఎంతో అవసరం అన్నారు. ప్రతి ఒక్కరూ ముందుగా తమ రక్త నిర్ధారణ చేసుకోవాలన్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు రక్తం దొరకక ఎన్నో ప్రాణాలు పోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. యువకులు ప్రతి మూడు మాసాలకొకసారి రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ లక్ష్మయ్య, అయ్యవారప్ప, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నివారణపై అవగాహన


మాట్లాడుతున్న ఎస్ఐ భాస్కర్‌రెడ్డి

వేంపల్లె : ట్రిపుల్‌ఐటీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'ది రోల్ ఆఫ్ యూత్ ఇన్ ప్రివెన్షన్ ఆఫ్ సైబర్ క్రైమ్' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎస్ఐ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరవీరుల నిస్వార్థ సేవలు గౌరవించి, వీరి కుటుంబాలకు మద్దతు, ధైర్యాన్ని పెంచేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. సైబర్ నేరాల నివారణలో యువత ముఖ్యపాత్ర పోషించాలన్నారు. సైబర్ క్రైమ్ నియంత్రణ పోరాటంలో చురుగ్గా పాల్గొనాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి డాక్టర్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ దీప్తి, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి


పోలీసు విధుల గురించి వివరిస్తున్న ఎస్ఐ రంగారావు

వేంపల్లె : ప్రతి విద్యార్థి ట్రాఫిక్ రూల్స్‌ను తప్పక పాటించాలని వేంపల్లి ఎస్ఐలు రంగారావు, తిరుపాల్ నాయక్ తెలిపారు. పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం సీఐ సురేష్‌రెడ్డి ఆదేశాల మేరకు పాఠశాల విద్యార్థులను పోలీస్‌స్టేషన్ వద్దకు పిలిచి పోలీసు విధులపై అవగాహన కల్పించారు. ఒక ఫిర్యాదు పోలీస్ స్టేషన్‌లో చేయాలంటే ఎవరిని సంప్రదించాలనే విషయంపై క్లుప్తంగా వివరించారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో లాకప్‌లు, ఇతర రికార్డులను చూపించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బీఎస్ రమణారెడ్డి, పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై డ్రైనేజీనీటితో ఇక్కట్లు

ఎర్రగుంట్ల : చిలంకూరు గ్రామంలోని డ్రైనేజీలలో పూడికలు తీయకపోవడంతో డ్రైనేజీలలోని నీరంత రోడ్డు పైకి చేరింది. దీంతో దుర్వాసన, దోమలు వ్యాపిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో ప్రజలు నానా కష్టాలు పడుతున్నారు. ఇప్పటికైన స్పందించి డ్రైనేజీ నీటిని బయటకు రాకుండా పూడికలను తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.


చిలంకూరులో రోడ్డుపైన ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు

ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి

జమ్మలమడుగు : పట్టణంలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని మానవహక్కుల పరిరక్షణ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు గురుమూర్తి తెలిపారు. శనివారం ఆర్డీఓ సాయిశ్రీకి వినతిపత్రం అందజేశారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థుల ఆధార్‌కార్డులు సక్రమంగా అప్‌డేట్ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు ఆధార్‌కేంద్రాల ఏర్పాటుకు వెంటనే చర్యలను తీసుకోవాలని ఆర్డీఓకు వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ దగ్గర కొత్త ట్రాన్స్‌ఫార్మర్ పని నిమిత్తం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్, చెన్నారెడ్డి కాలనీ, పుల్లారెడ్డి ఆసుపత్రి, చిన్నన్న రూములు, నగరిగుట్ట, రాక్ చర్చి తదితర ప్రాంతాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని జేఈ కె.రమేష్ తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్టు

ముద్దనూరు : మండలంలోని చిన్నదుద్యాల గ్రామంలో మద్యం బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేశారు. అదే గ్రామానికి చెందిన వెంకటప్రతాప్‌రెడ్డిని అరెస్టుచేసి అతని వద్ద నుంచి 29 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ దస్తగిరి తెలిపారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

పెద్దముడియం : గ్రామాల్లో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ గతంలో మద్యం అమ్మే వారిని, అక్రమంగా మద్యం విక్రయిస్తూ కేసుల్లో ఉన్నవారందరితో సమావేశం ఏర్పరిచి మద్యం అమ్మకాలపై కౌన్సిలింగ్ నిర్వహించారు.

స్టాఫ్ నర్సు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు : వనిపేంటలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల ఉన్నత పాఠశాలకు స్టాఫ్ నర్సు పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్, ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు జీఎన్ఎం, లేదా బీఎస్సీ నర్సింగ్ కోర్సు చేసిన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. నవంబర్ 1వ తేదీ సాయంత్రానికి జమ్మలమడుగులోని జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం

వల్లూరు : వల్లూరులో శనివారం పోలీసులు 42 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్పెషల్ టీం ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి కొప్పోలు ఎస్సీ కాలనీకి చెందిన పెద్ద నరసింహులు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 42 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గేటు వసూళ్లు చేసుకుంటూ ఇసుక అక్రమ దందా


బిస్మిల్లాబాద్ గ్రామంలో అక్రమ ఇసుక రవాణాకు వచ్చిన ట్రాక్టర్లు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : సీఎం చంద్రబాబు నాయుడు ఇసుకను అక్రమంగా తరలిస్తే ఏవర్నీ ఉపేక్షించమని క్వారీ ఉన్న చోట మాత్రం ఇసుకను ట్రాక్టర్లలో, ఎద్దల బండ్లలో అవసరాలకు మాత్రం తీసుకోవచ్చని చెబుతన్నారు. అయితే ఎర్రగుంట్ల మండలంలోని హనుమనుగుత్తి గ్రామ పంచాయతీ బిస్మిల్లాబాదు గ్రామంలో అధికారిక ఇసుక క్వారీ లేకపోయినా అక్కడ కొందరు ఇసుక అక్రమ రవాణ దందాకు తెరలేపారు. ఒక్కోక్క ట్రాక్టర్‌కు రూ.300లు గేటు వసూళ్లు చేస్తున్నారు. పెన్నానది నుంచి యథేచ్ఛగా రేయింబవళ్లు అక్రమంగా ఇసుక ట్రాక్టర్లు పోతున్నాయి. ఇంత జరుగుతున్నా స్థానిక అధికార యంత్రాంగం పట్టించుకోలేదు.

అడ్డుకున్న గ్రామస్తులు

బిస్మిల్లాబాదు పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అడ్డుకున్నారు. గ్రామంలోని కొందరికి గేటు కడుతున్నామని వారు రమ్మంటేనే మేం వచ్చామని ట్రాక్టర్లలో వచ్చిన వారు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంనకు చెందిన వారు గేటును వసూళ్లు చేసుకుంటున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎర్రగుంట్ల పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాక్టర్లను పట్టుకున్నారు. గేటును రాబట్టుకునే వారిని కూడా పోలీసుస్టేషన్‌కు పిలిపించారు. తర్వాత వారిని తహసీల్దార్ వద్ద హాజరుపరిచారు. తహసీల్దార్ శోభన్‌బాబు వారందర్నీ బైండోవర్ చేశారు. గ్రామంలో పికెటింగ్ పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పులివెందుల రూరల్ : మండలంలోని తుమ్మలపల్లె గ్రామ సమీపంలో పొలాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండటంతో పొలాల వద్దకు వెళ్లే రైతులు, గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేకమార్లు సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె వేయాలని కోరుతున్నారు.

మినుములో సస్యరక్షణ చర్యలు పాటించాలి


కొండాయపల్లెలో మినుము పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కమలాపురం : మినుము పంటలో సస్యరక్షణ చర్యలు పాటించాలని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు వీరయ్య, ప్రభాకర్‌రెడ్డి, కేవీకే కడప ఎస్ఎంఎస్ మానస తెలిపారు. శనివారం వారు మండలంలోని కొండాయపల్లెలోని మినుము పంటను పరిశీలించారు. మినుము పంటలో అధిక వర్షాల కారణంగా పసుపు వర్ణంలో ఆకులు రావడం గమనించారు. దీని నివారణకు 19:19:19 కిలో ఎరువు ఏకరాకు, ఫార్ములా 4ను 2గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. తద్వారా పోషకాలు మొక్కలకు అంది పంట పెరుగుదలకు దోహద పడుతుందన్నారు. మినుములో లద్దె పురుగుల వలన ఆకులను నష్ట పరచడం గమనించి లద్దెపురగు నివారణకు ఎమా మెక్టిన్ బెంజోఏట్ 100 గ్రాములు ఏకరాకు పిచికారి చేయాలన్నారు. శనగ పంటకు ఆఖరి దుక్కిలో ఎరువులు వేసి చాలా రోజులు కావడం వలన నత్రజని ఎరువును మరలా యూరియా 10 కేజీలు, పొటాష్ 15 కేజీలు ఏకరాకు వేసుకోవాలని సూచించారు. అలాగే శనగ పంటలో విత్తన శుద్ధికి కిలో విత్తనానికి 1.5 గ్రాముల టేబుకోనజోల్ కలిపి విత్తన శుద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి, ఏఈఓ దస్తగిరి, రైతులు పాల్గొన్నారు.

చిన్న పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు


దుకాణాలలో తనిఖీలు చేస్తున్న అధికారులు

ఎర్రగుంట్ల : 14 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలను ఏవరైన పనులలో పెట్టుకుంటే వారందరిపై చర్యలు తీసుకుంటామని కమలాపురం అసిస్టెంట్ లేబర్ అధికారి వీవీ ప్రసాద్ తెలిపారు. శనివారం మండల విద్యాశాఖ అధికారి శివప్రసాద్‌తో కలసి పాన్‌ఇండియా క్యాంపెన్ చిల్డ్రన్స్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించుటకు మెకానిక్ షాపులు, హోటల్స్, స్వీట్ల షాపులు, చిల్లర దుకాణాలపై దాడులు చేసినట్లు తెలిపారు. ఏవరైన చిన్న పిల్లలను పనులలో పెట్టుకుంటే చట్టరిత్యా చర్యలు తప్పవని యజమానులను హెచ్చరించారు. ఈ ప్రత్యేక డ్రైవ్ ఈ నెల 21వ తేదీ నుంచి నవంబరు 20వ తేదీ వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మహిళ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట తప్పిన చంద్రబాబు ప్రభుత్వం

వేంపల్లె : విద్యుత్ చార్జీల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం మాట తప్పిందని కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం వేంపల్లెలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచం, తగ్గిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కాగా విద్యుత్ చార్జీలు తగ్గించకపోగా ఏకంగా ఒకేసారి వినియోగదారులపై రూ.6073 కోట్లు అదనపు భారాన్ని మోపిందన్నారు. వచ్చే నవంబర్ నుంచి జనవరి వరకు ఈ భారాన్ని మోయాలని, ఇప్పటికే విద్యుత్ బిల్లులు కట్టలేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. విద్యుత్ తీగలు పట్టుకోవాల్సిన అవసరం లేదని, బిల్లు ముట్టుకుంటేనే షాక్ కొడుతుందని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న మానవత సభ్యులు

ఎర్రగుంట్ల : మండలంలోని చిలంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ శాఖ అధ్వర్యంలో విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం మానవత స్వచ్ఛంద సేవాసంస్థ చైర్మన్ రఘురామిరెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు డాక్టర్ రామాంజనేయరెడ్డి, లెక్చరర్ రాటాల గోపి, విశ్రాంతి ఉద్యోగులు రామాంజులరెడ్డి, ఎంవీ కృష్ణారావు, మానవత మాజీ జిల్లా అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

జమ్మలమడుగు : రాష్ట్రంలో మహిళలకు రక్షణలేకుండాపోయిందని ఎస్ఎఫ్ఐ బాలికల విభాగం నాయకురాల్లు స్వప్న, స్వాతిలు శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు రోజురోజుకు పెరిగిపోతుంటే మరోపక్క అకతాయిలు ప్రేమ పేరు చెప్పి బాలికలను పెట్రోల్ పోసి తగులబెడుతున్నారన్నారు. ప్రతిరోజు రాష్ట్రంలో ఎక్కడో ఒక చోట మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. కఠినమైన చట్టాలను అమలు చేయాలన్నారు.

పోలీస్ విధులపై విద్యార్థులకు అవగాహన


వైర్‌లెస్ సెట్ గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఎస్ఐ పెద్ద ఓబన్న

తొండూరు : పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ఎస్ఐ పెద్ద ఓబన్న ఆధ్వర్యంలో పోలీసు విధులపై అవగాహన కల్పించారు. పోలీసులు ఓపెన్ హౌస్, వైర్‌లెస్ సెట్, ఆయుధాల గురించి, కేసులు ఎలాపెట్టాలి, పోలీసుల విధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.